# కాళేశ్వరాన్ని కాటగలిపి...



మొదటిపేజీ తరువాయి...

సిద్ధమవుతున్నారు? ఇందులోనే ఉంది అసలు మతలబు! ప్రాణహిత, ఇంద్రావతి జలాలను గంప గుత్తగా కొల్లగొట్టాలనే భారీ కుట్ర జీబీ లింక్ వెనుక దాగి ఉన్నదని నీటిపారుదల రంగ నిపుణులు ఘంటాపథంగా చెప్తున్నారు. తమ వాదనలకు బలం చేకూరే అనేక అంశాలను ఉదహరిస్తున్నారు.

### ప్రాణహిత-ఇంద్రావతి నీళ్లే ప్రాణాధారం

గోదావరి నది పరీవాహక ప్రాంతాన్ని మొత్తంగా 12 సబ్ బేసిన్లుగా విభజించారు. అందులో 8 సబ్ బేసిన్ల నుంచి గోదావరికి వచ్చే మొత్తం జలాలు 31.95 శాతం. ఇక జీ9 లోని ఒక్క ప్రాణహిత సబ్ బేసిన్ నుంచే 26 శాతం జలాలు గోదావరిలోకి చేరుతాయి. అంటే ప్రాణహితలో ఏమేరకు జలాలు అందుబాటులో ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. దాని తర్వాత జీ10 సబ్‌బేసిన్ అయిన లోయర్ గోదావరి అంటే ఎస్సారెస్పీ నుంచి పోలవరం వరకు మధ్య గోదావరిలో వచ్చిచేరే జలాలు 7.19శాతం, జీ11 సబ్‌బేసిన్‌లోని ఇంద్రావతి నుంచి 22.93శాతం జలాలు గోదావరికి వస్తాయి. సూటిగా చెప్పాలంటే గోదావరి నీటిలభ్యతలో ప్రాణహిత, ఇంద్రావతిల జలాలే 48.93శాతం. ఇక ఇంద్రావతి జలాలను అటు ఒడిశా, ఇటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు కూడా వాటా మేరకు వినియోగించుకుంటున్నాయి. ప్రస్తుతం ఒక్క ప్రాణహిత నుంచే నికరంగా జలాలు గోదావరికి వచ్చిచేరుతున్నాయి. ఇక ప్రాణహితలో ఏడాదిలో 300రోజుల పాటు కనీస వరద ప్రవాహాలు కొనసాగుతుంటాయి. ఏ సబ్‌బేసిన్‌లో వరద ప్రవాహం మొదలు కాకముందే అంటే వర్షాకాలం ప్రారంభంలోనే ఈ బేసిన్ నుంచి వరద ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలోనే ప్రాణహిత జలాల భరోసాతోనే ఏపీ సర్కారు అంత భారీ వ్యయంతో జీబీ లింక్‌కు పూనుకున్నదని నీటిరంగ నిపుణులు పేర్కొంటున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రాణహిత నీళ్లు నిరాటంకంగా అందడంపైనే జీబీ లింక్ సాఫల్యత ఆధారపడి ఉంటుందని గణాంకాలతో వారు సహా వివరిస్తున్నారు. దీని ద్వారా దిగువన ఇంద్రావతి జలాలను సైతం చెరబట్టేందుకు వీలవుతుందని చెప్తున్నారు.

### వెన్నుదన్నుగా కేంద్రం

ఏపీ పన్నాగాలకు కేంద్ర సర్కారు వెన్నుదన్నుగా నిలుస్తున్నదని నీటిరంగనిపుణులు వివరిస్తున్నారు. అందుకు తెలంగాణకు చెందిన పలువురు సైతం లోపాయికారీగా సహకరిస్తున్నారని వారంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రాణహిత జలాలను ఆధారంగా తెలంగాణ నిర్మించుకున్న కాళేశ్వరం ప్రాజెక్టుపై అనేక విధాలుగా అక్కసు వెళ్లగక్కారనీ.. అశాస్త్రీయ, అడ్డగోలు వాదనలతో తప్పుడు ప్రచారాలకు తెరలేపారని వారు స్పష్టంచేస్తున్నారు. ఒక్క మేడిగడ్డ బరాజ్‌లో తలెత్తిన చిన్నపాటి సాంకేతిక లోపాన్ని బూచిగా చూపి మొత్తంగా కాళేశ్వరం ప్రాజెక్టునే కాటగలిపేందుకు ఎత్తులు వేస్తున్నారని ఇరిగేషన్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాంకేతిక పరీక్షలు, ఎన్‌డీఎస్‌ఏ పేరిట ప్రాజెక్టుపై అపోహలను సృష్టిస్తూ, నిరుపయోగమనే వాదనలు ప్రచారం చేస్తూ తెలంగాణ గొంతు నులిమే కుట్రలను అమలు చేస్తున్నారని వివరిస్తున్నారు. వాస్తవంగా ప్రాణహిత జలాలు యథేచ్ఛగా దిగువకు.. అంటే ఏపీకి వెళ్లాలనేదే అసలు ఉద్దేశమని, దానికోసమే కాళేశ్వరాన్ని కాటగలిపేందుకు ప్రయత్నించారని మేధావులు విశ్లేషిస్తున్నారు. కాళేశ్వరం ఘటన జరిగిన నాటినుంచి నేటివరకు కేంద్రం వ్యవహరిస్తున్న తీరు కూడా ఆ వాదనకు బలాన్ని చేకూరుస్తున్నది. అదీగాక ఇటీవల కాళేశ్వరం 3వ టీఎంసీకి సంబంధించి అనుమతులు ఇవ్వకుండా డీపీఆర్‌ను తిప్పిపంపడం వెనుక కూడా ఇందులో భాగమే ఉండొచ్చునన్న సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. మరోవైపు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ తీరును సైతం నీటిపారుదల రంగ నిపుణులు తప్పుపడుతున్నారు. పొరుగు రాష్ట్రం కుట్రలను అర్థం చేసుకోకుండా.. ప్రాణహితపై కాళేశ్వరం నిర్మాణ నేపథ్యాన్ని అవగతం చేసుకోకుండా ముందుకుపోతున్నదని వారంటున్నారు. ప్రాజెక్టును పునరుద్ధరించి, ప్రాణహిత జలాలను ఒడిసిపట్టకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదని, కాళేశ్వరాన్ని కాటగలపడం అంటే ఏపీ నీటి కుట్రలకు పరోక్షంగా సహకరించడమేనని ఇరిగేషన్ నిపుణులు మండిపడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం బరాజ్‌లుగానే పరిగణిస్తూ, ఏపీ ప్రణాళికలకు అనుగుణంగా అడుగులేయడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇవే కుట్రలు

గోదావరిలో నీటిలభ్యత ప్రధానంగా ప్రాణహిత, ఇంద్రావతి నుంచే అధిక ప్రవాహాలు ఉంటాయనేది గణాంకాలే సూటిగా తేటతెల్లం చేస్తున్నాయి. ఆ రెండు ప్రధాన ఉపనదులు కలిసిన తర్వాత ప్రాజెక్టులు నిర్మిస్తే తెలంగాణ బీడు భూములను గోదారమ్మ పావనం చేస్తుంది. కానీ ఉమ్మడి రాష్ట్రంలో ఆరు దశాబ్దాలపాటు జరిగిన తతంగం అందుకు భిన్నం. గోదావరి ప్రవాహం దిగువకు వెళ్లేదారిలో ఎక్కడా ఏ చిన్న ఆటంకం కలగకుండా సమైక్య పాలకులు తెలంగాణలో ప్రాజెక్టులు నిర్మించడం గమనార్హం. గోదావరి అత్యధిక దూరం తెలంగాణలోనే ప్రవహిస్తున్నా, ప్రాణహిత లాంటి నీటిలభ్యత ఉన్న నది వచ్చి చేరుతున్నా తెలంగాణ కట్టిన ప్రాజెక్టులు మాత్రం ఆ నీటిని ఒడిసిపట్టేలా నిర్మించలేదు. ధవళేశ్వరం దాకా గోదావరి ఆగకుండా పరుగులు తీయాలనే కుతంత్రాన్ని వారంతా అమలు చేశారు. అందులో భాగంగానే ఉమ్మడి ఏపీ ఏర్పడేనాటికి గోదావరి జలాల వినియోగానికి సంకల్పించిన, అప్పటికే మధ్యప్రదేశ్, మహారాష్ట్రతో ఒప్పందాలు పూర్తయ్యి అంత రాష్ట్ర సమస్యలు కూడా పెద్దగా లేని తెలంగాణ చారిత్రక ప్రాజెక్టుల గొంతు సైతం నులిమారు. 350 టీఎంసీల వినియోగానికి రూపకల్పన చేసిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టును 126టీఎంసీలకు కుదించి ఎందుకూ కొరగాకుండా చేశారు. 300 టీఎంసీల వినియోగానికి ప్రతిపాదించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు, దానికి అదనంగా 100 టీఎంసీలతో ప్రతిపాదించిన కంతనపల్లి ప్రాజెక్టులకు పాతరేశారు. చెరువులను ఖతం పట్టించారు. తెలంగాణవాదుల అలుపెరుగని పోరాటాల నేపథ్యంలో కంటితుడుపుగా పలు ప్రాజెక్టులను చేపట్టారు. అవి ఎక్కడా అంటే నీటిలభ్యత లేనిచోట! అంటే పుష్కలంగా నీరున్న ప్రాణహిత, ఇంద్రావతి సబ్‌బేసిన్లను వదిలి నీరు అంతగా లభించని మంజీరా (జీ4), మధ్యగోదావరి (జీ5), మానేరు (జీ6)పై ఆధారం చేసుకునే ప్రాజెక్టులను నిర్మించారు. ఎగువనుంచి వరద తక్కువైందని తెలిసినా శ్రీరాంసాగర్‌ను ఆధారం చేసుకుని వరద కాలువ.. దాని దిగువన ప్రధాన గోదావరిపై ఎల్లంపల్లి ప్రాజెక్టు, కడెంపై మరో ప్రాజెక్టు, గుత్ప, అలీసాగర్ వంటి ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. అదీగాక ఆయా ప్రాజెక్టుల నిర్మాణంలో దశాబ్దాల తరబడి కాలయాపన! వెరసి పేరుకే ప్రాజెక్టులే తప్ప వాటితో తెలంగాణ దక్కిన ఫలితం శూన్యం. కాగితాలపై ఆయకట్టును చూపుతూ ఉమ్మడిపాలకులు ఏళ్లుగా కనికట్టు చేస్తూ కట్టిపడేశారు. సూటిగా తెలంగాణ ఏర్పడేనాటికి గోదావరిపై ఉన్న ప్రాజెక్టులతో ఏటా నికరంగా 100టీఎంసీల జలాలు వాడుకున్న దాఖలాలు లేవంటే ఉమ్మడి పాలకుల కుట్రను అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు కూడా ప్రాణహిత జలాలను తెలంగాణకు దక్కకుండా చేసే కుట్రలకు ఏపీ తెరలేపిందని నీటిరంగ నిపుణులు తెలుపుతున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నింపగలిగే జలాశయాలు.. ఆయకట్టు

| ప్రాజెక్టు | ఆయకట్టు | టీఎంసీలు |
|---|---|---|
| ఎస్సారెస్పీ1,2 | 13,66,000 | 90.31 |
| ఎల్లంపల్లి | 1,51,000 | 20.17 |
| సింగూరు | 40,000 | 30 |
| వరదకాలువ | 1,00,000 | 02 |
| నిజాంసాగర్ | 2,31,000 | 17 |
| కడెం | 68,000 | 07.63 |
| మిడ్‌మానేరు | 2,20,000 | 25.87 |
| చెరువులు, చెక్‌డ్యామ్‌లు | 5,00,000 | 65 |
| మొత్తం | 26,76,000 | 257.98 |

నోట్: ఇక కాళేశ్వరం ద్వారా వినియోగించుకునే జలాలు 240టీఎంసీలు..

| | | |
|---|---|---|
| సీతమ్మసాగర్ | 6లక్షల ఎకరాలు | 60టీఎంసీలు |
| సమ్మక్కసాగర్ | 5.16లక్షల ఎకరాలు | 60టీఎంసీలు |

గడిచిన ఐదేళ్లుగా జూన్19నాటికి కాళేశ్వరం వద్ద వరద ప్రవాహం

| సంవత్సరం | నీటి ప్రవాహం |
|---|---|
| 2020 | 22,600 క్యూసెక్కులు |
| 2021 | 14,500 క్యూసెక్కులు |
| 2022 | 6700 క్యూసెక్కులు |
| 2023 | 7000 క్యూసెక్కులు |
| 2024 | 10000 క్యూసెక్కులు |

## నాటి కుట్రలన్నింటికీ కేసీఆర్ విజన్‌తో చెక్

**తెలంగాణ** ఉద్యమనేతగా కేసీఆర్ రాష్ట్రంలోని ప్రతి అంగులంపైనా పూర్తి అవగాహన పెంచుకున్నారు. గోదావరి, కృష్ణా నదీవ్యవస్థనే కాదు సాగునీటి రంగాన్ని ఆవాహన చేసుకున్నారు. నీళ్లు లేని చోట ప్రాజెక్టులు నిర్మించిన ఉమ్మడి పాలకుల కుట్రలను పసిగట్టి గర్జించారు. కుటిల పన్నాగాలను తెలంగాణ జనానికి బట్టబయలు చేశారు. అందుకే స్వరాష్ట్ర ఏర్పాటు తరువాత అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాణహిత జలాలను ఒడిసిపట్టడమే ప్రధాన లక్ష్యంగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. ఏడాదిలో 300 రోజులు నీళ్లుండే ప్రాణహితను ఆధారంగా చేసుకుని బరాజ్‌లను నిర్మించారు. ఇంద్రావతి జలాల వినియోగానికి అటు దేవాదుల ఆయకట్టుకు భరోసా కల్పించేందుకు సమ్మక్కసాగర్ బరాజ్‌ను నిర్మించారు. దాని దిగువన 60 టీఎంసీల సామర్థ్యంతో సీతమ్మసాగర్‌కు శ్రీకారం చుట్టారు. సూటిగా చెప్పాలంటే ప్రాణహిత, ఇంద్రావతి నదుల నీటిని ఒడిసిపట్టి, ఎగువన నీళ్లు లేని ప్రాజెక్టులకు తరలించి గోదావరిని నిరంతర సజీవ నదిగా మార్చారు. తెలంగాణను పంటలతో పచ్చగా మార్చే లక్ష్యంతో ముందుకుసాగారు. సుదీర్ఘ మేధోమథనం సాగించి కాళేశ్వరం ప్రాజెక్టును రీడిజైన్ చేసి అత్యంత స్వల్పకాలంలో పూర్తిచేశారు. ఉమ్మడిపాలకులు సృష్టించిన శతకోటి సమస్యలకు కాళేశ్వరం ద్వారా ఒకే ఒక్క బలమైన పరిష్కారాన్ని చూపారు. పాత ప్రాజెక్టుల ఆయకట్టుకు భరోసానివ్వడమేగాక కొత్త ఆయకట్టుకు కాళేశ్వరం నేటికీ పురుడుపోస్తున్నది. కాళేశ్వరంతో తెలంగాణలోని సాగునీటిరంగ ముఖచిత్రమే మారిపోయింది. ఈ ఒక్క ప్రాజెక్టు ద్వారానే గోదావరిలో మన 954 టీఎంసీల్లో 450 టీఎంసీలకు పైగా తెలంగాణ వినియోగించుకునేందుకు మార్గం సుగమమైంది. ఎగువ నుంచి వరద వచ్చినా, రాకున్నా ఎల్లంపల్లికి ఢోకా లేకుండాపోయింది. శ్రీరాంసాగర్ జలాశయానికి ఏడాది పొడవునా జలకళ. దైవాధీనంగా మానేరుపై నిర్మించిన ఎగువ, మధ్య, దిగువ మానేరుకు కాళేశ్వర గంగ శాశ్వత భరోసా కల్పించింది. మంజీరా ముఖం చాటేసినా, సింగూరుకు కాళేశ్వరం ఊపిరులూదింది. ఆయకట్టుకు మోక్షం లభించింది. హల్దీ వాగుద్వారా చారిత్రక నిజాంసాగర్‌కు ప్రాణహిత జలాలతో ప్రాణం పోస్తున్నది. ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణ ప్రగతి కాళేశ్వరానికి ముందు, ఆ తరువాత అనే నిర్వచించవచ్చు. సమ్మక్కసాగర్‌తో దేవాదులకు భరోసా లభించింది. సీతారామ పూర్తయితే గోదావరిలో తెలంగాణ తన వాటాను పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలను రూపొందించి అమలు చేశారు. అందుకు నేడు గత ప్రాజెక్టుల కింద సాగవుతున్న ఆయకట్టు, వస్తున్న పంటల ఉత్పత్తే సజీవ సాక్ష్యం. ఇప్పటికే అనేక రికార్డులను తిరగరాసిన కాళేశ్వరం భవిష్యత్‌లో జీవనరేఖగా నిలువనుందని ఇంజినీరింగ్ నిపుణులు, మేధావులు చెబుతున్న మాట. అంతటి ప్రాధాన్యమున్న కాళేశ్వరాన్ని కాటగలిపే కుట్రల వెనుక.. పొరుగు రాష్ట్రానికి సహకరించే ఎత్తుగడ కూడా ఉన్నదా అనే అనుమానాలు జీబీ లింక్ నేపథ్యంలో వ్యక్తమవుతున్నాయి.

## లోకం పోకడ




వాయుకాలుష్యానికి భయపడికాదు గురూ, రాజకీయ కాలుష్యం భరించలేక..!

## ఇది తెలంగాణ ప్రజల విజయం

### బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కృషి ఫలితం

### 'బ్రిజేష్' ఆదేశాలపై ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): బీడుపడ్డ తెలంగాణ భూములకు కృష్ణా జలాలను మళ్లించాలని గళమెత్తి నినదించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కృషి ఫలించిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. కృష్ణా జలాల కేటాయింపు విషయంలో 1956 అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టం సెక్షన్ 3 ప్రకారమే వాదనలు వింటామని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేయడంపై ఆమె హర్షం వ్యక్తంచేశారు. 'కృష్ణా నీళ్లలో మా వాటా మాకు కావాలి అని కేసీఆర్ చేసిన పోరాట ఫలాలు అందుకోవడం ఎంతో దూరంలో లేదు' అని ఆమె స్పష్టంచేశారు. 'రాష్ట్రాల వారీగా నీటి కేటాయింపులపై విచారణ జరపాలని గత పదేండ్లుగా కేసీఆర్ చేసిన వాదనకే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ మొగ్గు చూపడం సంతోషకరం.. ట్రిబ్యునల్ ఆదేశాలు బీఆర్ఎస్ విజయం, ఇది తెలంగాణ ప్రజల విజయం' అని స్పష్టం చేశారు.

### కవితకు తమిళనాడు సీఎం లేఖ

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన కవితకు ప్రత్యేక లేఖ రాశారు. కాగా, ఆమె సైతం తమిళనాడు సీఎంకు కృతజ్ఞతాపూర్వక లేఖ రాశారు. ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్సీ కవిత లేఖ రాయటంతోపాటు తన ఎక్స్‌వేదికగా తమిళంలో కృతజ్ఞతలు తెలియజేయటం గమనార్హం.

నీటి కోసం రాజాపేటలో నిరసన తెలుపుతున్న రైతులు

## సాగు నీటికోసం రైతుల ఆందోళన

### చెరువులు నింపాలని డిమాండ్

### యాదాద్రి జిల్లా రాజాపేటలో ధర్నా

రాజాపేట, జనవరి 17 : కాళేశ్వరం జలాలతో యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని చెరువులను నింపాలని రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం రాజాపేటలో ధర్నా చేశారు. అనంతరం స్థానిక గోపాల్‌చెరువును పరిశీలించి మాట్లాడారు. చెరువుల్లో చుక్క నీరు లేక సాగు భూములు బీళ్లుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం 15వ ప్యాకేజీ కాల్వ పనులు త్వరగా పూర్తిచేసి మండలంలోని గొలుసు కట్టు చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. చెరువులు నింపే వరకు మండల కేంద్రంలో రిలే దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో రైతు జేఏసీ మండల కన్వీనర్ ఎర్రగోకుల జశ్వంత్, గౌరవ అధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, ఊట్కూరి అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, బీజేపీ నాయకుడు మేకల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గుగని కార్మికుల పింఛన్ పెంచండి

### సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : రిటైర్డ్ బొగ్గుగని కార్మికుల పింఛన్ మొత్తాన్ని పెంచాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. కోల్ పెన్షనర్స్‌కు పలు ప్రయోజనాలు వర్తింపజేయాలని విజ్ఞప్తిచేసింది. కోల్‌మైన్స్ ప్రావిడెండ్ ఫండ్ ఆర్గనైజేషన్(సీఎంపీఎఫ్వో) 183వ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల సమావేశాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. రెడ్‌హిల్స్‌లోని సింగరేణి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేంద్ర బొగ్గుశాఖ కార్యదర్శి విక్రమ్‌దేవ్ దత్, అదనపు కార్యదర్శి రూపిందర్ బ్రార్, సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, డైరెక్టర్లు సత్యనారాయణరావు, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. సింగరేణి ఉద్యోగుల సంఘం నేతలు సహా కోల్ పెన్షనర్స్ సంఘం నేతలు డీ రామచందర్‌రావు, వేణుమాధవ్ తమ సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు.

## తగ్గిన చలి తీవ్రత

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చలి తీవ్రత కాస్త తగ్గుముఖం పట్టింది. కొన్ని రోజులపాటు ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయి చలి వణికించగా.. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు కాస్త పెరగడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో రానున్న మూడ్రోజులపాటు ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కన్నా ఎక్కువ నమోదయ్యే అవకాశాలున్నట్టు వెల్లడించింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రెండు రోజుల క్రితం 12 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్టు అధికారులు తెలిపారు. సంగారెడ్డి, ఉమ్మడి ఖమ్మంలోని పలు ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగింది. శనివారం వరకు ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయని, ఉదయం పొగమంచుతోపాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని అధికారులు తెలిపారు.

# 'బ్రిజేశ్' ఆదేశాలు.. కేసీఆర్ పోరాట ఫలితమే

## ఇది ముమ్మాటికీ బీఆర్ఎస్ ప్రభుత్వ విజయమే • సెక్షన్ 3 ప్రకారం రాష్ట్రాలకు నీళ్ల కేటాయింపులు ఉండాలని ట్రిబ్యునల్‌తో పట్టుబట్టిందే కేసీఆర్

- మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం
- కాంగ్రెస్ ఘనతని చెప్పకోవడం సిగ్గు చేటు
- కృష్ణా జలాల కేటాయింపు విషయంలో తెలంగాణకు అన్యాయం చేసిందే కాంగ్రెస్
- న్యాయమైన వాటా దక్కేదాకా పోరాటం చేస్తాం : మాజీ మంత్రి హరీశ్ స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 17 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల కేటాయింపు విషయంలో 1956 అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టం సెక్షన్ 3 ప్రకారం వాదనలు వింటామని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఆదేశాలపై మాజీ మంత్రి హరీశ్ రావు హర్షం వ్యక్తంచేశారు. పదేండ్లపాటు నిర్విరామంగా కేసీఆర్ చేసిన పోరాటానికి వచ్చిన ఫలితమే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తాజా ఉత్తర్వులని శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టంచేశారు. ఇది ముమ్మాటికీ కేసీఆర్ ప్రభుత్వం పట్టుబట్టి సాధించిన విజయమేనని తేల్చిచెప్పారు. ఇది కాంగ్రెస్ గొప్పతనం అని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. నీటి వాటాల్లో తెలంగాణ హక్కులను సాధించుకునేందుకు నాడు కేసీఆర్ సీఎం హోదాలో బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట హాజరై తెలంగాణ పక్షాన వాదనలు వినిపించారని, అందుకే తెలంగాణకు న్యాయం దక్కే అవకాశాలు మెరుగు పడ్డాయని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పాటైన నెల రోజులకే నాటి సీఎం కేసీఆర్ ఆదేశాలతో, ఆనాటి సాగునీటి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నదీ జలాల వివాదాల చట్టం 1956, సెక్షన్ 3 ప్రకారం కృష్ణా జలాల పంపిణీ కోసం ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని జూలై 14, 2014న లేఖ రాసినట్టు తెలిపారు. అయితే, కేంద్రం ఐఎస్ఆర్‌డబ్ల్యూడీ చట్టానికి బదులుగా రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 ప్రకారం విచారణకు ఆదేశించిందని, ఈ విచారణతో తెలంగాణకు న్యాయమైన వాటా లభించే అవకాశం లేదని కేసీఆర్ భావించారని, అందుకే ఆయన నిరంతరాయంగా ఐఎస్ఆర్‌డబ్ల్యూడీ చట్టం 1956, సెక్షన్ 3 ప్రకారం పునఃపంపిణీకి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చారని వివరించారు.

### 2015లోనే సుప్రీంకోర్టుకు కేసీఆర్ సర్కార్

కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా కోసం 2015లోనే కేసీఆర్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లిందని హరీశ్ గుర్తుచేశారు. 2020 అక్టోబర్‌లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనూ ఇదే అంశంపై తీవ్రంగా పట్టుబట్టినట్టు తెలిపారు. కేసీఆర్ ఒత్తిడికి తలొగ్గిన కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సుప్రీం కోర్టులో తెలంగాణ ప్రభుత్వం వేసిన కేసును విరమించుకునే షరతుపై ట్రిబ్యునల్‌కు రిఫర్ చేయడానికి అంగీకరించారని, అయితే, కేసు విరమించుకున్న తక్షణమే ట్రిబ్యునల్ వేసేందుకు హామీ ఇవ్వాలని కేసీఆర్ పట్టు బడితే, 'మేము న్యాయ మంత్రిత్వ శాఖ సలహా తీసుకున్న తర్వాతనే నిర్ణయం ప్రకటిస్తాం' అని నాడు కేంద్ర మంత్రి పేర్కొన్నారని గుర్తుచేశారు. కేంద్ర మంత్రి షెకావత్‌ను మరోసారి ఢిల్లీలో కలిసిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కేసు విత్ డ్రా చేయాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం 2021 జూన్‌లో విత్‌డ్రా పిటిషన్ వేసిందని, సుప్రీం కోర్టు అక్టోబర్ 2021లో అనుమతించిందని వివరించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే (అక్టోబర్ 2023) సెక్షన్ 3 కింద నీటి విభజన కోసం ట్రిబ్యునల్‌కు కేంద్ర ప్రభుత్వం టర్మ్స్ ఆఫ్ రెఫెరెన్స్ (టీవోఆర్) ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

### అంతిమ విజయం కోసం పోరాటం

అనేక వేదికల ద్వారా బీఆర్ఎస్ చేసిన పోరాట ఫలితంగానే తాజాగా సెక్షన్ 3 ప్రకారం వాదనలు వింటామని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఆదేశాలని హరీశ్ స్పష్టంచేశారు. ఒకవైపు సెక్షన్ 3 ప్రకారం నీటి వాటా జరగాలని శాశ్వత పరిష్కారం కోసం పోరాటం చేస్తూనే, మరోవైపు తాత్కాలికంగా నీటి వాటాను 50 శాతం పెంచాలని పోరాటం కొనసాగించామని వివరించారు. అందులో భాగంగానే ట్రిబ్యునల్ ముందు 575 టీఎంసీల నీటి వాటా డిమాండ్ పెట్టినట్టు గుర్తుచేశారు. కేఆర్ఎంబీ సమావేశాల్లో, కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖల్లో ట్రిబ్యునల్ తీర్పు వచ్చేదాకా తెలంగాణకు కృష్ణా జలాల్లో 50 శాతం వాటా ఇవ్వాలని నిరంతరాయంగా తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తూనే వచ్చిందని తెలిపారు. ఇప్పటికే పదేండ్ల విలువైన కాలం హరించుకుపోయిందని, తెలంగాణ దశాబ్దాలుగా కృష్ణా జలాల్లో న్యాయమైన వాటాను కోల్పోయిన నేపథ్యంలో సెక్షన్ 3 కింద విచారణ త్వరితగతిలో పూర్తి చేసి న్యాయమైన వాటా వచ్చేలా చేయాలని ట్రిబ్యునల్‌ను కోరుతున్నట్టు పేర్కొన్నారు. సెక్షన్ 3 ప్రకారం కృష్ణా నదీజలాల కేటాయింపులపై ఈ ఏడాది ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు వాదనలు వింటామని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ప్రకటించిన క్రమంలో పటిష్టమైన వాదనలు వినిపించేలా నిష్ణాతులైన న్యాయవాదులను ఎంపిక చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. సెక్షన్ 3 ప్రకారం వాదనలు వినేందుకు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు పాక్షిక విజయమేనని, తెలంగాణకు కృష్ణా నదీ జలాల్లో న్యాయమైన వాటా దక్కితేనే అంతిమ విజయం సాధించినట్టవుతుందని తేల్చిచెప్పారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత జాగరూకతతో అంతిమ ఫలితాన్ని రాబట్టేలా కృషి చేయాలని కోరారు.

> కృష్ణా జలాల కేటాయింపులు రాష్ట్రాల వారీగా ఉండాలి తప్ప ప్రాజెక్టుల వారీగా ఉండకూడదని మొదటి నుంచీ కేసీఆర్ చేసిన వాదనతో ఎట్టకేలకు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఏకీభవించింది. నదీ జలాల కేటాయింపుల్లో తెలంగాణకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నం. కేసీఆర్ కొట్లాడి సాధించిన విజయాన్ని కూడా తమ ఘనతగా చెప్పకోవడం కాంగ్రెస్ పార్టీ భావదారిద్ర్యానికి నిదర్శనం. -హరీశ్‌రావు

### కాంగ్రెస్ ఉదాసీనత రాష్ట్రానికి శాపం

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనత రైతుల పాలిట శాపంలా మారిందని, కాలువలు తవ్వితే రైతుల పొలాలకు నీలిచ్చే అవకాశమున్నా పాలమూరు రంగారెడ